క్లుప్తంగా

పేదలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం



కల్వకుర్తిరూరల్: పేదలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలో ఎరుకుల కులస్తుల సమావేశంలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఫుడ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్ట్



కొల్లాపూర్(పెంట్లవెల్లి): మండలంలోని జటప్రోల్‌లో సోమవారం చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దు అయిన జటప్రోల్ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కురుమయ్య, చంద్రశేకర్, మూర్తి పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ



కొల్లాపూర్(పెంట్లవెల్లి): మండల కేంద్రంలో తాపీ మేస్త్రీలకు నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో పీఎస్‌బీఓసీపీడబ్ల్యూడబ్ల్యూబీ వారి సహకారంతో రెండు వారాలుగా మేస్త్రీలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు ఆ శాఖ అధికారులు అందజేశారు. పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పనిచేసేటప్పుడు హెల్మెట్ ధరించాలని తాపీ మేస్త్రీలకు అధికారులు సూచించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్, శివశంకర్, గంగాధర్, అధ్యక్షుడు రామచందర్, మైమూద్, యాకూబ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఇంటింటి ప్రచారం



తెలకపల్లి: మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్తకుమార్ బరిలో ఉన్నారని ఆయనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఎస్పీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శివశంకర్, మల్లేష్, రాజేష్, శ్రీకాంత్, మహేష్, శ్రీధర్, వెంకటేష్ పాల్గొన్నారు.

పద్మన్నపల్లిలో వైద్య శిబిరం



లింగాల: మండలంలోని పద్మన్నపల్లిలో సీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు శివ, అనిల్ గ్రామస్తులను డెంగీ, ఇతర సీజనల్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు రక్తహీనత ఉందని గుర్తించారు. ఈ సందర్భంగా వారికి పౌష్టికాహారం అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఏఎన్‌ఎం యాదాబాయి, కోనేర్ సంస్థ సభ్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కొల్లాపూర్(కోడేరు): మండల కేంద్రంలో విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పట్వారి నర్సింహకు చెందిన రెండు కాడెద్దులు వ్యవసాయ పొలంలో మేత మేస్తున్నాయి. దగ్గరలో ఉన్న ఓ రైతు వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన ఎద్దు విలువ రూ.30వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.



వెల్దండలో



కల్వకుర్తిలో గాయత్రీదేవిగా ..



ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో

అమ్మా.. కరుణించు

కల్వకుర్తిరూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీమాతను గాయత్రీదేవి రూపంలో అలంకరించారు. మహిళలకు చిలక ధారణ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ జూలూరు రమేష్‌బాబు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి జగదీశ్వర్, శ్రీధర్, పీఆర్‌ఓ రాజయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారిని వనలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు. పట్టణంలోని వరిదేల శమీవృక్షం వద్ద దుర్గాదేవిని గాయత్రీమాతగా కొలిచారు.

అచ్చంపేట రూరల్: దేవాలయాలు, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవీగా దర్శనమిచ్చారు. మహిళలు కోలాటాలు ఆడుతూ సందడి చేశారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు పలు



అచ్చంపేట పూజలు నిర్వహిస్తున్న మహిళలు

గ్రామాల్లో దేవీ నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

ఉప్పునుంతల: పట్టణంలో దుర్గామాతను రెండోరోజు గాయత్రీదేవీ రూపంలో అలంకరించారు. ఉప్పునుంతల కేదారేశ్వరాలయం, శాలివాహన చౌరస్తా, లక్ష్మాపూర్, పెద్దాపూర్, కాంసానిపల్లి, గట్టుకాడిపల్లి, తాడూరు, గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల, గ్రామాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

వెల్దండ: మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో అమ్మవారిని గాయత్రీ మాతగా అమ్మవారిని అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ భూపతిరెడ్డి, బచ్చు రామకృష్ణ, జగదీశ్వర్, సైదులు, తదితరులు ఉన్నారు.

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో రెండోరోజు అమ్మవారు గాయత్రీ మాతగా భక్తులకు దర్శనం ఇచ్చారు. విగ్రహదాత జూలూరి ప్రదీప్ సంతోష్, మాధవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.



మన్ననూర్‌లో



తాడూరులో



కొల్లాపూర్‌లో

ఎంపీ రాములు వర్గం కాంగ్రెస్‌లో చేరిక

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ప్రజలకు అహంకారం కావాలో... ఆత్మాభిమానం కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేటలోని ఓ ఫంక్షన్ హాలులో ఎంపీ రాములు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్ అనుచర వర్గం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో వంశీకృష్ణ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వంశీకృష్ణ మాట్లాడారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీఆర్‌ఎస్ పార్టీలోని నాయకులనే భయభ్రాంతులకు గురిచేశారని, భరించలేక పార్టీని వీడుతున్నారన్నారు. అచ్చంపేట మాజీ ఉపసర్పంచ్, పబ్లిక్‌క్లబ్ అధ్యక్షుడు దమ్మోజు సతీష్, వెంకటేష్, గోపాల్, శరణ్‌గౌడ్, ఘనపురం శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రమేష్, నర్సిరెడ్డి, దిలీప్‌ప్రసాద్, దేవేందర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీటీసీలు మంత్రియానాయక్, ప్రతాప్‌రెడ్డి, నాయకులు చంద్రమోహన్, సీఎం రెడ్డి, రమేష్‌రెడ్డి, రాజేందర్, మాధవరెడ్డి, మధుకర్‌రెడ్డి, గౌరీశంకర్, కాశన్నయాదవ్, రామనాథం, ఖాదర్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

వెల్దండ: కల్వకుర్తిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలంలోని దుబ్బతండా, పోషమ్మగడ్డతండా, రావిచెట్టుబావి తండా, కల్వకుర్తి మండలంలోని వేపూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు వారి సమక్షంలో భారీగా చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, సింగల్‌విండో వైస్ చైర్మన్ సంజీవ్‌కుమార్ యాదవ్, నాయకులు శేఖర్, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్, రాజుయాదవ్, తదితరులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



మన్ననూర్: స్థానిక పీటీజీ పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం నిర్వాహకుల ప్రారంభించారు. మొదటి నాలుగు రోజుల పాటు టోర్నీ కొనసాగుతోందని పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ: 20,000 సీబీఎం ట్రస్టు చైర్ పర్సన్, అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, రెండో బహుమతి రూ: 10,000 చెంచుసేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి రాజేంద్ర ప్రసాద్ అందజేస్తారని వివరించారు. నిర్వాహకులు యశ్వంత్, కార్తిక్, ఉదయ్, యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా రాజశేఖర్



మన్ననూర్: దివ్యాంగుల క్రమశిక్షణ సంఘం రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా రాజశేఖర్‌ను నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని హరిత హోటల్‌లో దైనంపల్లి మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాజశేఖర్‌కు జాతీయ సంఘం అధ్యక్షుడు తుడుం రాజేందర్ నియామకపత్రం అందజేశారు. దివ్యాంగుల సమస్య పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న వారికి రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా దివ్యాంగుల సంఘం నాయకులు వెంటకయ్య, రఘునందన్, రామ్మోహన్, ఇంతియాజ్, బాలీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

చారకొండ: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు బీఫామ్ అందుకోవడంతో నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, కోఆప్షన్ సభ్యులు సలీం, మండల అధ్యక్షుడు రవీందర్, యాదయ్య గౌడ్, రమేష్, నరేందర్ రెడ్డి, యాతం శ్రీను, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధనోత్సవాలు

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో సోమవారం ప్రజాకవి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తండ్రి గోరటి నర్సింహ 16వ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆధ్యాత్మిక గురువు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఇంటి నుంచి ఆయన సమాధి వరకు భజన సంకీర్తనలు ఆలపించారు. అనంతరం సోమవారం తెల్లవారు జాము వరకు భజన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, భక్తులు సాయిలు, చెన్నయ్య, బాలపీరు, రాములు, సాయిలు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చెస్ పోటీలతో జ్ఞాపకశక్తి మెరుగు

కల్వకుర్తి టౌన్: చెస్ పోటీలతో జ్ఞాపకశక్తి మెరుగవుతుందని రిటైర్డు ప్రిన్సిపాల్, చెస్ క్రీడాకారుడు గోపాల్ అన్నారు. సోమవారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో బుద్ధచెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి అండర్–14,17 కేటగిరీలో గెలుపొందిన వారికి ఆయన బహుమతులను అందజేశారు. వంశీకిరణ్ ప్రథమస్థానం, పవన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వరుసగా 10 స్థానాలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త



బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

పాపిశెట్టి రాము, చెస్ మాస్టర్లు రమేష్, మల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మండల విస్తృత సమావేశం

వెల్దండ: మండల కేంద్రంలోని ఏవీఆర్ గార్డెన్‌లో ఈనెల 18న బీఆర్‌ఎస్ మండల విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామ అధ్యక్షులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎన్నికల ఇన్‌చార్జ్ గోలి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జయప్రకాష్, నాయకులు జైపాల్‌నాయక్, వెంకటయ్య ముదిరాజ్, కాడురామ్‌నాయక్, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని గుమ్మకొండలో సోమవారం బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండా మణెమ్మ హాజరై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పేదలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ జెండాను ఎగురవేద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేకాడి లక్ష్మణ్, నారాయణ, రాజప్ప, ఆంజనేయులు, శ్రీను, బాలమణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత

అచ్చంపేట రూరల్: మండలంలోని లింగోటంలో సారా తయారీ చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో సోమవారం గ్రామంలో దాడులు నిర్వహించారు. గ్రామంలో వెంకటయ్య అనే వ్యక్తి ఇంటిలో ఎనిమిది లీటర్ల సారా గుర్తించారు. సారాను స్వాధీనం చేసుకొని వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ జిలాని తెలిపారు.

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి సమీపంలో సోమవారం కాట్రావత్ బామిని అనే మహిళ సారాను తరలిస్తోంది. పోలీసుల తనిఖీలో మహిళ వద్ద ఆరు లీటర్ల సారా ఉన్నట్లు గుర్తించామని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. మహిళ నుంచి సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మండల వాసికి డాక్టర్ భీమన్న పురస్కారం

చారకొండ: మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లికి చెందిన కవి మల్లెకెడి రాంచందర్‌జీకి డాక్టర్ బోయి భీమన్న పురస్కారం దక్కింది. తిరుపతిలోని బాకారపేటలో ఆదివారం ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో రాంచందర్‌జీ పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరచారు. ఈ మేరకు ఉషోదయ ఫౌండేషన్ నిర్వాహకులు పద్మశ్రీ డాక్టర్ బోయి భీమన్న పురస్కారం అందజేశారు. సోమవారం గ్రామంలో రాంచందర్‌జీని గ్రామస్తులు అభినందించి సన్మానించారు.

నియమావళిని అమలు చేయాలి

అచ్చంపేట రూరల్: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపిరాం కోరారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ప్రతి పోలింగ్ స్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలని కోరారు. పోలింగ్ బూతుల వద్ద దివ్యాంగులకు ర్యాంప్‌లు కచ్చితంగా ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల విధుల పట్ల అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నియమ, నిబం



మాట్లాడుతున్న ఆర్‌ఓ గోపిరాం

ధనల ప్రకారం పోలింగ్ బూతుల వద్ద శాంతియుత వాతావరణం ఏర్పడేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో సమష్టిగా ముందుకెళ్దాం



మాట్లాడుతున్న గువ్వల బాలరాజు



లింగాల నుంచి తరలివెళ్తున్న నాయకులు

వంగూరు: అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకెళ్తూ విజయం సాధిద్దామని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అచ్చంపేట అభ్యర్థి గువ్వల బాల్‌రాజ్ అన్నారు. బీఫాం అందుకున్న తర్వాత నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా సోమవారం వంగూరు, చారకొండ మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం బైక్ ర్యాలీతో వీహెచ్‌ఆర్ ఫంక్షన్‌హాల్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమన్ని ధీమా వ్యక్తం చేవారు. సమావేశంలో జీబీఆర్ ట్రస్ట్ చైర్మన్ గువ్వల అమల, పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, గణేష్‌రావు, మందరాజు, లాలూయాదవ్, సురేందర్‌రెడ్డి, విజయేందర్‌గౌడ్, గురువయ్యగౌడ్, దేవ, తిరుమలేష్, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీకి తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

లింగాల: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకొని సోమవారం అచ్చంపేటకు వస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు స్వాగతం పలికేందుకు మండలం నుంచి భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్రవాహనాలపై వెళ్లారు. బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఫాం అందుకొని కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి సోమవారం 7వ వార్డు బీఆర్‌ఎస్ కార్యకర్తలు తరలివెళ్లారు. అంతకుముందు పట్టణంలోని శివాలయంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గెలవాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శేఖర్, నారాయణమూర్తి, రవి, రావుల శ్రీనివాస్ ఉన్నారు.

బల్మూర్: అచ్చంపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్‌కు బీఫాం దక్కడంతో సోమవారం మండల వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెండు వేల బైక్‌లతో ర్యాలీగా అచ్చంపేటకు తరలివెళ్లారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

వెల్దండ: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాచూర్‌లో గున్నెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలన్నారు. యువత క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోతీలాల్‌నాయక్, సంజీవ్‌కుమార్, శ్రీశైలం, శేఖర్, క్రాంతికుమార్, వెంకట్, మధుసూ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

దన్‌రెడ్డి, రామచెంద్రారెడ్డి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సబ్బండ వర్గాలకు మేలు

తెలకపల్లి: కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు చేకూరుతుందని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రజా చైతన్యయాత్ర, గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గౌరారంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించాడు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా ఆశీర్వాదించాలని కోరారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు బోయ మల్లయ్య, రామచంద్రయ్య, పుల్లయ్య, శ్రీనులు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, రోహిణి, మాజీ ఎంపీపీ పర్వతాలు,



మాట్లాడుతున్న కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

మాజీ సర్పంచ్ బిరుదు సాయిలీల, నాయకులు రాజారెడ్డి, బిక్కు సాయబు, రఘుకుమార్, సల్వారి కురుమూర్తి, గోరటి కురుమయ్య, గుండూరు శ్రీనివాసులు, హరీష్, బోయ కురుమయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ

తెలకపల్లి: వివిధ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ రమా వాపోయారు. సోమవారం మండల కేంద్రంలోని యోగా భవనంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022 మార్చి 15న ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో వంట కార్మికులకు రూ.2 వేల పెంచుతామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పటికీ సీఎం హామీ నెరవేరలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించకుండా అన్యాయం చేశారన్నారు. సబ్సిడీపై గ్యాస్ సిలిండర్‌లు ఇవ్వాలని, రెండు జతల కాటన్ దుస్తులు ఇచ్చి, సామాజిక భద్రత కల్పించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు పాదిలరామయ్య, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, బాలస్వామి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపస్ లక్ష్మణ్, కార్మికులు నాగమణి, ప్రశాంతి, పద్మ, చిట్టెమ్మ, గీతారాని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై నిరసన



బల్మూర్: మండలంలోని గోదల్‌లో విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తుండటంతో సోమవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. అప్రకటిత విద్యుత్ కోతలతో సతమతమవుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులు చెల్లించకుండా నిరసన తెలిపారు. వెంటనే ఫీడర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించే వరకు బిల్లులు చెల్లించమని బిల్లుల వసూళ్లకు వచ్చిన సిబ్బందిని అడ్డుకున్నారు. గ్రామానికి విద్యుత్ అధికారులు, సిబ్బంది మరోసారి బిల్లుల కోసం వస్తే నిర్బంధిస్తామని హెచ్చరించారు. ఈ విషయమై ఏఈ సుధాకర్‌ను వివరణ కోరగా 15రోజుల్లో ప్రత్యేక ఫీడర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గోదల్‌తో పాటు సమీప గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సామాజిక తనిఖీలకు సిద్ధం కావాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో ఉపాధి హామీ ద్వారా నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు, ఉపాధిహామీ సిబ్బంది సిద్ధం కావాలని ఎంపీడీఓ గంగామోహన్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందికి, సామాజిక తనిఖీ బృందానికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి గాను పూర్తైన పనులు, వినియోగించిన సామాగ్రికి సంబంధించిన కొలతలు సామాజిక తనిఖీ బృందం ఎస్‌ఆర్‌పీ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో పరిశీలిస్తుందన్నారు. ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు, ఉపాధిహామీ సిబ్బంది సంబంధిత రికార్డులను వారికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రవీణ్, ఉపాధిహామీ ఈసీ కిషన్, ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు, సామాజిక తనిఖీ బృందం పాల్గొన్నారు.